# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 72 | విశాఖపట్నం | 12-12-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 72 | VISAKHAPATNAM | 12-12-2025 FRIDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


### ముగిసిన ఏపీ కేబినేట్ సమావేశం

# రూ.9,500 కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం ముగిసింది. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి.. నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 44 అజెండా అంశాలతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రూ.9,500 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించిన ప్రాజెక్టులు, అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్ నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదే విధంగా గవర్నర్ కార్యాలయం, గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గ సమావేశంలో చర్చించి అంగీకారం తెలిపారు. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. కేబినెట్ భేటీలో పలువురు మంత్రులపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి మంత్రులు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని సీఎం గట్టిగా చెప్పారు. రేపల్లెలో గ్రామీణ రహదారులు నిర్మాణానికి చొరవ చూపినందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫ్లవర్ బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. రుషికొండపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి: మంత్రివర్గం అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో సీఎం చంద్రబాబు ఇతర అంశాలపై చర్చించారు. రుషికొండ ప్యాలెస్‌పై మంత్రివర్గ ఉపసంఘం త్వరితగతిన నిర్ణయం తీసు కోవాలని ఆదేశించారు. సబ్ కమిటీకు వచ్చిన ప్రతిపా దనలు బట్టి, ఎలా వినియోగించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని ప్రమోట్ చేసే విధంగా వీలైనన్ని ఎక్కువ పర్యాటక ఈవెంట్లు నిర్వహించాలని పర్యాటక, అటవీ, దేవా దాయ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు జరగా లని సూచించారు. రాష్ట్రానికి ఎక్కువ మంది పర్యా టకులు వచ్చేలా చూడాలి అని ఆదేశించారు. పీఎం కుసుమ్, సూర్యఘర్ వంటి పథకాల్లో కేంద్రం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుంటూ వీలైనంత ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచిం చారు. పగటి పూట విద్యుత్ వినియోగ భారం తగ్గించు కునేలా ఈ 2 పథకాలను ఎక్కువ ప్రోత్సహిం చాలని తెలి పారు. చేనేతలకు ఇస్తున్న విద్యుత్ రాయితీలలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశిం చారు. పరిశ్రమలకు భూ కేటాయింపులు, రెవెన్యూ సమ స్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జ్ మంత్రులు సమీక్షలు చేయక పోవడం సరికాదని మంత్రులతో చంద్రబాబు అన్నారు.

### చంద్రబాబుతో పూర్తి సమన్వయంతో

# వెళ్తున్నాం: మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం దిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల బీజేపీ ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు మాట్లాడారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నాయని, ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఆ పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు బీజేపీ కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని మోదీ దిశానిర్దేశం చేశారు. ఈ అల్పాహార విందులో ఎంపీ పురందేశ్వరి, సీఎం. రమేష్, భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్య ఏంటని, రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగిం చుకోవడంలో విఫలమవుతున్నారని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని మోదీ సూచించారు.

### మంత్రి మనోహర్ నేతృత్వంలో దూసుకుపోతున్న

# ధాన్యం కొనుగోళ్లు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ (కేఎంఎస్ 2025-26) సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కేవలం ఒక్కరోజే, అంటే డిసెంబర్ 10న, ఏకంగా 1,46,607 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి పౌరసరఫరాల శాఖ ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. డిసెంబర్ 11 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 3,24,296 మంది రైతుల నుంచి మొత్తం 20,64,673 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు గాను రైతులకు ఇప్పటివరకు రూ.4,609.89 కోట్లను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైన కేవలం 15 రోజుల్లోనే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%ఖీజ×%)కు 1,71,651 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్డ్ రైస్ బియ్యాన్ని పంపడం ఒక చారిత్రక రికార్డుగా పౌరసరఫరాల శాఖ పేర్కొంది. ఇటీవల కురిసిన వర్షాలు, దిత్వా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని 106 రైస్ మిల్లులకు ఇతర జిల్లాల నుంచి ధాన్యం తరలించేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేసింది. కొనుగోలు, రవాణా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 32,000 లారీలు, ట్రాక్టర్లు, ప్రత్యేక రైళ్లను వినియోగిస్తున్నారు.రైతులకు అండగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పారదర్శక విధానాలతో కొనుగోళ్లు జరుపుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మిల్లర్లపై కఠిన నిఘా ఉంచి, రోజువారీ సమీక్షలతో ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని, రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.



6లో

మీ గుండె ఆరోగ్యంగా ఉండాలా?

మాచర్ల కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు



2లో

### అమరావతిలో మొదటి క్వాంటం కంప్యూటర్: మంత్రి పార్థసారథి



**అమరావతి, పతాకం న్యూస్:** దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా కీలక ప్రతిపాదనకు కేబినెట్‌లో ఆమోదం తెలిపినట్లు మంత్రి పార్థసారథి చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఏపీ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. అమృత్ 2 లో భాగంగా 2026 మార్చి 31 కల్లా పెండింగ్ పనులు ప్రారంభించాలని కేంద్రం స్పష్టం చేసిందని.. అమృత్ 2లో భాగంగా 506 పెండింగ్ ప్రాజెక్టులను రూ.9,613 కోట్ల నిధులతో చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. రూ.163 కోట్లతో అమరావతిలో లోక్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. (తరువాయి 2వ పేజీలో)

### కూటమి ప్రభుత్వంపై

# షర్మిల విమర్శలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. "చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి దొంగ పనులు" అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం చేస్తోందంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# 'వందేమాతరం' వివాదం

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో కోట్లమంది భారతీయుల గొంతుల్లో ధ్వనించిన వందేమాతర గీతం నేటి పాలకుల మతతత్వ రాజకీయలకు పాచికగా మారడం విషాదం. 'చరిత్రను నిర్మించలేనివారు చరిత్రను వక్రీకరి స్తారు' అన్నది కళ్లముందు కనిపిస్తున్న సత్యం. గత పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి సాధించలేదు కాబట్టి ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. దీన్ని పక్కదారి పట్టించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు కొత్త అజెండాలు ముందుకు తెస్తున్నారు. తాజాగా దేశం ఎదుర్కొం టున్న రూపాయి విలువ దారుణ పతనం, విమానయాన ప్రయాణాల సంక్షోభం, పంటల గిట్టుబాటు ధరల గురించి చర్చించాల్సిన పార్లమెంట్‌లో 150 సంవత్సరాల నాటి వందేమాతరం గీతాన్ని పాలకులు చర్చనీయాంశం చేసారు. డిసెంబరు 6వ తేదీ (బాబ్రీమసీదు కూల్చివేత దినం)న దేశ ప్రధాని మోడీ మాట్లాడుతూ, 'వందేమాతరం గీతంలోని కొన్ని చరణాలను తొలగించడమే దేశ విభజనకు బీజం వేసింది. విభజన మనస్తత్వం ఇప్పటికీ దేశానికి ఒక సమస్యగా ఉంది' అన్నారు. ఈ తరం ఎదుర్కొంటున్న ఉపాధి, విద్య, వైద్యం, నివాసం లాంటి కనీస అవసరాలు తీర్చలేని పాలకులు రానున్న పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు, మతతత్వ అజెండాను కొనసాగించేందుకు వందేమాతరం అంశాన్ని మరోసారి తెరమీదికి తెచ్చారు. దేశం మొత్తం బ్రిటీష్ పాలన కింద వున్నప్పటికీ అనేక సంస్థానాల కింద దేశ ప్రజలు విభజించబడి వుండేవారు. ప్రజలను ఏకం చేయడం కోసం నాటి రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, రచయితలు, కవులు, కళాకారులు అనేక మార్గాల్లో కృషి చేశారు. అందులో భాగంగా దైవారాధనను ఒక మార్గంగా కొందరు ఎంచుకున్నారు. జాతీయోద్యమ తొలి రోజుల్లో ఇదంతా దేశభక్తిలో భాగంగానే జరిగింది. ఈ నేపథ్యంలోనే 1770 నాటి అతి భయంకరమైన బెంగాల్ కరువు, సన్యాసుల తిరుగుబాటు కథాంశంగా బెంగాల్ కవి బంకించంద్ర ఛటర్జీ 'ఆనంద మఠం' అనే నవలను 1875లో రాసారు. అందులో ఒక సాధువు పాత్ర మాతృభూమిని కాళీ దేవతతో పోల్చి పూజిస్తూ 'బందేమాతరం' గీతాన్ని ఆలపిస్తాడు. (తర్వాతి కాలంలో అది వందేమాతరంగా ప్రసిద్ధి పొందింది) ఈ నవల రాసిన ఏడు సంవత్సరాల తరువాత 1882లో 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికలో ప్రచురించ బడింది. బ్రిటీష్ పాలకులు అనుసరించిన విభజించు, పాలించు కుట్రలో భాగంగా 1905లో బెంగాల్‌ను మతం ఆధారంగా విభజన చేశారు. దీనికి వ్యతిరేకంగా హిందూ, ముస్లింలు పెద్దఎత్తున ఉద్యమించారు. ఈ సందర్భంలో వందేమాతరం ప్రజానినాదంగా మారుమ్రోగింది. ప్రజా ఉద్యమంతో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ విభజనను రద్దు చేసుకున్నా- అది ఆశించిన మతతత్వ బీజాలను మాత్రం బలంగా నాటగలిగింది. ఈ పరంపరలో భాగంగా ముస్లింలీగు, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనే మతసంస్థలు ఏర్పడ్డాయి. ప్రజలందరీ ఉమ్మడి నినాదాలు అయిన హిందూ, ముస్లిం భాయి భాయి స్థానంలో కొందరి నుండైనా అల్లాహౌ అక్బర్, వందేమాతరం నినాదాలు ముందుకు రావడానికి ఈ మత సంస్థలే కారణమయ్యాయి. స్పష్టమైన జాతీయోద్యమ లక్ష్యాలతో 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. మత విశ్వాసాలు, ఆచారాల ఆధారంగా ప్రజలను సమీకరించడానికి భిన్నంగా వర్గ ఉద్యమాలు పెరిగాయి. బొంబాయి, కలకత్తా, మద్రాసు లాంటి ప్రాంతాల్లో కార్మిక పోరాటాలు, అనేక సంస్థానాల్లో భూమి, సామాజిక వివక్షపై ఉధృత పోరాటాలు జరిగాయి. ఈ పరిణామం బ్రిటిష్ పాలకులతో పాటు, దేశంలోని భూస్వామ్య, ధనాఢ్య వర్గాలను కలవరపాటుకు గురిచేసింది. ఈ వర్గాలు మత సంస్థలకు పెద్దఎత్తున విరాళాలు ఇచ్చి పెంచి పోషించాయి. వందేమాతర గీతం సుమారు 1900 సంవత్సరం వరకు "అమ్మా, నీకు నమస్కరిస్తున్నాను" అనే శీర్షికతోనే పిలవబడేది. మతతత్వ రాజకీయ సమీకరణలు పెరిగేకొద్దీ ప్రతి అంశం హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలకు దారితీసింది. 1937లో లక్నోలో జరిగిన ముస్లిం లీగ్ 25వ సమావేశంలో 'ఈ గీతం విగ్రహారాధనతో కూడినదని, ఇది ఇస్లామిక్ విశ్వాసాలకు భిన్నమైందని, భారతదేశంలో నిజమైన జాతీయవాదం పెరుగుదలను ఇది ఖచ్చితంగా దెబ్బతీస్తుంది' అని తీర్మానిం చింది. ఆ తరువాత కొద్ది నెలలకు నెహ్రూ అధ్యక్షతన 1937 అక్టోబర్ 26న కలకత్తాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 'జాతీయ సమావేశాల్లో వందేమాతరం ఎక్కడ పాడినా, మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలి' అని తీర్మానించింది. మహమ్మద్ ఆలీ జిన్నాను బుజ్జగించేందుకు నెహ్రూ ఈ పని చేసారని విమర్శిస్తున్న ప్రధాని మోడీ ఈ చరణాలను ఎంపిక చేసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అనే విషయాన్ని మాత్రం కావాలనే మరుగు పరుస్తున్నారు. జాతీయ కాంగ్రెసు సమావేశంలో మొట్టమొదటిసారి 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతాన్ని ఆలపించినప్పుడు ఆ సమావేశానికి అధ్యక్షుడు రహమతుల్లా సయానీ అనే విషయాన్ని గుర్తించాలి. జాతీయోద్యమ నాయకుల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై తీవ్రమైన విబేధాలు, చర్చలు, రాజీలు జరిగాయి. వ్యక్తిగతంగా మహాత్మాగాంధీ- అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్- గాంధీ, గాంధీ- నెహ్రూ, నెహ్రూ- పటేల్‌ల మధ్యబీ రాజకీయంగా కాంగ్రెసు- కమ్యూనిస్టు పార్టీల మధ్య అనేక అంశాలపై విబేధాలు వచ్చాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి దేశాన్ని విముక్తి చేయాలనే ఉమ్మడి లక్ష్యం సాధనకు ఇవి ఆటంకం కాకుండా తాత్కాలికంగా అనేక మధ్యే మార్గాలను అనుసరించారు. జాతీయోద్యమ చరిత్రలో ఇలాంటి సంఘటనలు అనేకం వున్నాయి. అందులో వందేమాతర గీతం కూడా ఒకటి. నేడు ఈ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్న శక్తులే జాతీయోద్యమంలో క్షమాభిక్షలు కోరిన విషయాలు ఆధారాలతో సహా బట్టబయలు అయ్యాయి. నాడు సామ్రాజ్యవాదం అనుసరించిన విభజించు పాలించులో భాగంగా సృష్టించిన మతతత్వాన్ని నేటికీ కొనసాగాలని ఈ శక్తులు కోరుకోవడమే జాతీయోద్యమ స్ఫూర్తికి విరుద్ధం. ఇలాంటి విషయాలపై ప్రజల దృష్టిని మళ్లించి దేశ సంపదను, సహజ వనరులను దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడంలో భాగంగానే- వందేమాతరం లాంటి సున్నిత అంశాలు పదేపదే వివాదాస్పదం అవుతున్నాయి.

# మాచర్ల కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు




**మాచర్ల, పతాకం న్యూస్:** వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి పల్నాడు జిల్లా మాచర్ల కోర్టు రిమాండ్ విధించింది. టీడీపీ నేతల జంట హత్యల కేసులో మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వారిద్దరూ గురువారం లొంగిపోయిన విషయం తెలిసిందే. అనంతరం న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. మరోవైపు పల్నాడు జిల్లా జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులు కోర్టులో లొంగిపోనున్న దృష్ట్యా మాచర్లలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మాచర్లలో పిన్నెల్లి అనుచరుల గత అరాచకాలు, గుండాయిజాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉన్నారు. అలాగే మరోవైపు ముందు జాగ్రత్తగా పల్నాడు జిల్లా వైఎస్సార్సీపీ నేతలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విడదల రజనిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రశాంతంగా ఉన్న పల్నాడులో టీడీపీ నేతలను అదే పార్టీకి చెందిన మరికొంత మంది హత్య చేసిన సంగతి తెలిసిందే. గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, అతని సోదరుడు జవిశెట్టి కోటేశ్వరరావు తెలంగాణ రాష్ట్రంలోని హుజూర్‌నగర్ జిల్లాలో ఒక పెళ్లికి హాజరై బైక్‌పై గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈ సమయంలో సాయంత్రం 5 గంటల సమయంలో పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బొదిలవీడు వద్దకు వచ్చేటప్పటికి ఓ స్కార్పియో వాహనం వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టి ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఆపై కొన ఊపిరితో ఉన్న జవిశెట్టి కోటేశ్వరరావును రాయితో మోది చంపినట్లు పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. అనంతరం ఆ వాహనాన్ని ఆక్కడే వదిలేసి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. హత్య ఘటనలో పిన్నెల్లి సోదరుల కుట్ర, ప్రోద్భలం ఉందని, నిందితులు ఓ రెస్టారెంట్‌లో సమావేశమై హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు అధికారులు గతంలోనే వివరించారు. పల్నాడు జిల్లాలో జరిగిన జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులపై 302 సెక్షన్ కింద కేసు నమోదైటంది. ఈ కేసులో ఏ-1గా జవిశెట్టి శ్రీను, ఏ-2గా తోట వెంకట్రావు, ఏ-3గా తోట గురవయ్య, ఏ-4గా నాగరాజు, ఏ-5గా తోట వెంకటేశ్వర్లు, ఏ-6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ-7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్‌ను కొట్టేస్తూ హైకోర్టు ఆగస్టు 29న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన పిటిషన్లను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టేసింది. అంతేకాకుండా మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వ్యాఖ్యానించిన జస్టిస్ సందీప్ మెహతా హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్‌కు అర్హత లేదని వెల్లడించారు. పిన్నెల్లి సోదరులు విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు చెప్పినా, వారు సహకరించలేదని, సాక్షులను బెదిరించారని, సాక్ష్యాలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నం చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం వారిని వెంటనే అరెస్టు చేసేందుకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని వ్యాఖ్యానించింది.

# పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**గొలుగొండ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఏఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ రాజాన సూర్యచంద్ర తన సొంత నిధులతో పంపిణీ చేశారు.సమాజ సేవ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ,విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన తెలిపారు.స్టడీ మెటీరియల్ పంపిణీ అనంతరం విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన సూర్యచంద్ర మాట్లాడుతూపదో తరగతి విద్యార్థి జీవితంలో అత్యంత బాధ్యతాయుత దశ అని,ఈ సమయంలో పెట్టే శ్రమ భవిష్యత్‌కు బాటలు వేస్తుందని అన్నారు.పరీక్షలు భయంకరమైనవి కావు.. అవి మీ ప్రతిభను నిరూపించే అవకాశాలని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. ప్రతిరోజూ క్రమబద్ధంగా చదివితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని సూచించారు.చదువుతో పాటు వ్యక్తిత్వ అభివృద్ధి,సమయ నిర్వహణ,క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ గురించి వివరించారు.

# 15వ ఆర్థిక సంఘం రూ.31 లక్షల దుర్వినియోగం



**అరకులోయ, పతాకం న్యూస్:** బస్కి గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం కేటాయించిన సుమారు ం31 లక్షల రూపాయల నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపిస్తూ సిపిఎం పార్టీ గురువారం బస్కి సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా డివిజనల్ అసిస్టెంట్ కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బురిడి దశరథ్, మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, "నవంబర్ 5న గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకూ ఎలాంటి చర్య తీసుకోలేదు. పంచాయతీ పాలకవర్గం నిధులను దుర్వినియోగం చేసింది. ఇప్పటికైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలు వెల్లడించాలి. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాం" అని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో క్లాఫ్ మిత్ర కిల్లో అర్జున్, డొంబు దొన్ను, కొర్రా దేవన్న, పీసా కార్యదర్శి సుబ్బారావు, కన్నయ్య, నవీన్, రామన్న, రాంబాబు, అప్పలరాజు, కామేష్, గురుమూర్తి, ఈశ్వరరావు, కోగేష్, దాసు, దాసు బాబు, కుమార్, నాగేశ్వరరావు, నర్సింగరావు, కిరణ్, జగబందు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి శాశ్వత హోదా.. పార్లమెంటులో బిల్లు పెడతాం: కేంద్ర మంత్రి పెమ్మసాని



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి శాశ్వత హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో గానీ, లేదా వచ్చే సమావేశాల్లో గానీ అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ బిల్లు ప్రవేశపెడతామని ఆయన తెలిపారు. రాజధానిని 2014 నుంచి గుర్తించాలా? లేక ఇప్పటి నుంచి గుర్తించాలా? అనే దానిపై ఉన్న సాంకేతిక కారణాల వల్లే బిల్లు ఆలస్యమవుతోందని పెమ్మసాని వివరించారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అమరావతి బిల్లుపై వైసీపీ అధినేత జగన్ విషం కక్కుతున్నారని, ఆయనను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు పాలన చేతకాకపోవడం వల్లే 34 వేల మంది రైతులు ఇచ్చిన భూములను సద్వినియోగం చేసుకోలేక రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు. అమరావతిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వేలాది మంది నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నారని పెమ్మసాని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే 16 జాతీయ సంస్థలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. త్వరలోనే హడ్కో, కాగ్, పోస్టల్ భవనం, కేంద్రీయ విద్యాలయాలు వంటివి అమరావతిలో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణానికి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశామని ఆయన వెల్లడించారు.

(మొదటిపేజీ తరువాయి)

# అమరావతిలో మొదటి క్వాంటం కంప్యూటర్: మంత్రి పార్థసారథి

ఎల్ 1 బిడ్లను ఆమోదించే బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతిలో ఈ3 రోడ్డు విస్తరణకు ఎల్ 1 బిడ్ ఆమోదానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీకి బాధ్యతలు అప్పగించామన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో పలార్ నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.15.96 కోట్ల నిధులను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 417 టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సాంఘిక సంక్షేమం విభాగంలో సామాజిక సేవలో అనుభవం ఉన్న వ్యక్తులను చైర్మన్లు, మెంబర్లుగా నియమించే ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పిందన్నారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా కీలక ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం చెప్పిందని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన 11 సంస్థల ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని మంత్రి పార్థసారథి తెలిపారు. క్వాంటం కంప్యూటర్లు తయారు చేయడం కోసం ముందుకు వచ్చిన పలు సంస్థల ప్రతిపాదనలకు, అలాగే క్వాంటం కంప్యూటింగ్ లో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న పలు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సంస్థలకు సంబంధించి 20267 కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. విద్యుత్ చార్జీలను రూ. 5.12 నుంచి 4 రూపాయలకు తీసుకురావాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. దీని కోసం రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పలు సంస్థల ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించిందన్నారు. కృష్ణపట్నం పోర్టులో 4731 ఎకరాలు మల్టీ ప్రాడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం 2010లో ల్యాండ్ కొనుక్కున్నారని.. అక్టోబర్ 2019లో గత ప్రభుత్వం ఈ భూ కేటాయింపులను రద్దు చేసిందన్నారు. దీన్ని కోర్టు కొట్టి వేయడం వల్ల ప్రాజెక్టు పదేళ్లు ఆలస్యమైనందున పెనాల్టీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 3 ఏళ్లలో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించాలని సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మహిళల ప్రపంచ కప్ గెలుపులో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారిణి శ్రీ చరణికి ప్రోత్సాహకం ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు, విశాఖపట్నంలో 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్థసారథి చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం కలిన బీసీ వినియోగదారులకు రూ.20 వేల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రూ.5445 కోట్ల అంచనా బడ్జెట్‌తో పీఎం సూర్యఘర్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.

# షర్మిల విమర్శలు

ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) సుమారు రూ.15,651 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రజాభిప్రాయ సేకరణకు ప్రకటన కూడా జారీ చేసిందని షర్మిల గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా, ప్రజలపై భారం పడదని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని పదేపదే చెప్పడం పాత చింతకాయ పచ్చడిలా ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15 వేల కోట్లను ప్రజల నుంచి ట్రూ-అప్ బిల్లుల రూపంలో వసూలు చేసి వారి జేబులకు చిల్లులు పెట్టారని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి 'టైమ్ ఆఫ్ ది డే' పేరుతో ఇంకో రూ.15 వేల కోట్లను దోచుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని షర్మిల ఆరోపించారు. నమ్మి ఓటేసినందుకు ఏడాదికోసారి ప్రజలకు ఇలా 'హైటెన్షన్ షాక్' ఇస్తున్నారని, ఆర్థిక లోటు పేరుతో ప్రజల నడ్డి విరవడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రికి కొన్ని డిమాండ్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. "మీకు నిజంగా ఛార్జీలు పెంచకూడదనే చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మీద నిలబడాలనుకుంటే, ఏపీఈఆర్సీ ప్రతిపాదనలపై తక్షణం స్పందించాలన్నారు.

# రొబ్బసింగి గ్రామంలో తీవ్రమైన మంచినీటి సమస్య.. పట్టించుకోని అధికారులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ పరిధిలోగల రొబ్బసింగి గ్రామ ప్రజలు మూడు నెలలుగా తీవ్రమైన మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.గ్రామానికి నీరు సరఫరా చేసే మోటర్ పదే పదే కాలిపోతుండటంతో సమస్య మరింత తీవ్రమైంది.ఈ సందర్భంగా ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి పంద్రా గంగరాజు మాట్లాడుతూ“మా గ్రామంలో మంచి నీటి సమస్య మూడు నెలలుగా వేదిస్తోందని,సమస్య పరిష్కారం కోసం డౌనూరు సచివాలయం సెక్రటరీకి పలుమార్లు కలిసి విన్నవించిన శాశ్వత పరిష్కారం చూపలేదని,పాత మోటర్ని రిపేర్ చేసి మళ్లీ అమర్చడం,మళ్లీ అది కాలిపోవడం ఇలా పదే పదే జరుగుతోందని,ఇన్ని సార్లు రిపేర్ చేయడం కంటే కొత్త మోటర్ కొనుగోలు చేసి అమర్చాలని కోరినా సెక్రటరీ స్పందించలేదని ” తెలిపారు.అలాగే ఈ నెల 6వ తేదీన గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుతో ఫోన్ ద్వారా మాట్లాడించగా రెండు రోజుల్లో కొత్త మోటర్ అమర్చి నీటి సమస్యను పరిష్కరిస్తామని సచివాలయ సెక్రటరీ హామీ ఇచ్చినప్పటికీ,వారం రోజులు గడిచినా మోటర్ రాకపోవడమే కాక మరే చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు నెలలుగా గ్రామస్తులు ఊట నీటిపై ఆధారపడాల్సి వచ్చిందని,అధికారులు తక్షణమే స్పందించి శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెట్ల గాంధీ, సెగ్గే జగ్గారావు సహా గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి



**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొయ్యూరు మండలం,కిందంగి నుండి ముకుడిపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనుల కారణంగా వ్యవసాయ భూములు నష్టపో యిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షులు బిడిజానా అప్పారావు మాట్లడుతూ ప్రజల సౌకర్యర్థం రోడ్డు అవసరమేనని,రోడ్డు నిర్మాణంలో ఏవోక్క రైతు నష్టపోకుండా చూడవలసిన భాధ్యత ప్రభుత్వానిదేనని,నష్టపోయిన రైతులైన కించే పుట్టి పడాల్,కించే జోగులమ్మ,కించే వలసయ్య,కించే బుజ్జిబాబులకు సరైన పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.సూరిబాబు,ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సూరిబాబు,మండల కార్యదర్శి గాంధీ,పెసా ఉపాధ్యక్షులు రామ్మూర్తి,ఆర్టీఐ జిల్లా సెక్రెటరీ గంగరాజు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ముసలి నాయుడు ఉన్నారు.

## రాంబిల్లిలో సోలార్ కంపెనీ

### రూ.3,990 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ‘రెన్యూ ఎనర్జీ’ సంస్థ



**రాంబిల్లి, పతాకం న్యూస్:** దేశంలో తొలి ఇంటిగ్రేటెడ్ సోలార్ ఇన్‌గాట్ అండ్ వేఫర్ తయారీ పరిశ్రమ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏర్పాటు కానుంది. సోలార్ విద్యుత్ తయారీకి అవసరమైన ఫొటోవాల్టిక్ (సోలార్) పలకలను ప్రస్తుతం విదేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల సోలార్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అనేక ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. వాటికి అవసరమైన ముడి సరకుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇక్కడే వాటిని తయారుచేయాలని ‘రెన్యూ ఎనర్జీ గ్లోబల్ పీఎల్‌సీ’ అనే సంస్థ రూ.3,999 కోట్లతో రాంబిల్లిలో ఇంటిగ్రేటెడ్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకువచ్చింది. దీనికోసం రెన్యూ ఫొటోవాల్టాయిక్స్ పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటుచేసింది. ఆరు గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసే ఈ ప్లాంటు కోసం రాంబిల్లిలో 130 నుంచి 140 ఎకరాలు కావాలని కోరింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు సిఫారసుతో ఈ ఫైల్ వచ్చే వారం రాష్ట్ర మంత్రివర్గం క్లియరెన్స్‌కు వెళుతున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి నిర్మాణాన్ని 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని, వాణిజ్య కార్యకలాపాలను 2028 జనవరికి ప్రారంభిస్తామని సంస్థ తన ప్రతిపాదనల్లో పేర్కొంది. దీంతో పాటు రెండు గిగావాట్ల హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు, 300 కేటీపీఏ సామర్థ్యంతో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు, ఐదు గిగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ప్రాజెక్టులు (విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్) ఏర్పాటుచేస్తుంది. వీటన్నింటికీ కలిపి రూ.82 వేల కోట్లు పెట్టుబడి పెడతామని ఇటీవల జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందం చేసిందని తెలిసింది. వీటిని నడపడానికి రోజుకు 95 మెగావాట్ల నిరంతర విద్యుత్, రోజుకు పది మిలియన్ లీటర్ల నీరు అవసరమని, అందుకు తగిన ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

## రాజవొమ్మంగి మండలంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి మండలంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం అయ్యాయని మండల వ్యవసాయ అధికారి పి చక్రధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నా యన్నారు, శరబవరం, రాజవొమ్మంగి, దూసారిపాము, లబ్బర్తి, జడ్డంగి, కొమరాపురం మొదలైన గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. మండలంలోని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. క్వింటా “ఎ” గ్రేడ్ రకం-2389 రూపాయలు, సాధారణ రకం -2369 రూపాయలు చొప్పున ధాన్యం పంపిన 24 గంటలలో రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జామ అవుతున్నాయన్నారు.

## అడపా నర్సింగమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే కొణతాల



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** గతం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వడ్డాది గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కొణతాల రామకృష్ణ శ్రేయోభిలాషి అడపా నర్సింగమూర్తి ని గురువారం ఆయన స్వగృహం కు విచ్చేసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింగమూర్తి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కారం వైపు చొరవ చూపాలి



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** వి.మాడుగుల మండలంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ 4000 రూపాయలు ఇవ్వాలని 1999లో కోర్టు ఇచ్చిన 551 జీవో లో గుర్తింపు కార్డులు కనీస వేతనం 21000 పిఎఫ్ ఇఎస్ఐ అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎంపీడీవో ఆఫీసులో ఏ.ఓ. జి.గోపాల్ రావుకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ నాయకుడు ఆర్ దేవుడు నాయుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కే భవాని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతు మాడుగుల మండలంలో ఉన్నటువంటి పంచాయతీ కార్మికులకు వారి సమస్యలు పరిష్కారం చేయాలని కోర్టు ఇచ్చిన జీవోను అమలు చేయాలని పంచాయతీ కార్మికులకు అరకొర జీతాలు కూడా ప్రతి నెల ఇవ్వలేదు అని సీఐటీయూ నాయకులు అన్నారు.జీతాలు సకాలంలో రాక కొత్త అప్పులు పుట్టక పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని నెలనెలా హెల్త్ అలవెన్స్ తో పదివేల రూపాయలు ఇవ్వాలని కనీస వేతనాలు 21000 ఇవ్వాలని పిఎఫ్,ఈఎస్ఐ అమలు చేయ్యాలని విదులు నుంచి తొలగి పోయిన కార్మికులను తిరిగి విదులోకి తీసుకోవాలని మూడు నెలల నుండి 8 నెలల వరకు జీతాలు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే కార్మికులకు చెల్లించే విదంగా ఉండాలి అని అన్నారు,రాజకీయ వేధింపులు నుండి పంచాయతీ కార్మికులకు రక్షణ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ యూనియన్ కార్యదర్శి ఏల్చూరి ఈశ్వరరావు, అప్పారావు, కామరాజు, కృష్ణ,సూరిబాబు అధిక సంఖ్యలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

## గిరిజన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్

### కలెక్టర్ దినేశ్‌కుమార్



**పాడేరు, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంత ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందని, ఈ క్రమంలోనే చక్కని మార్కెటింగ్ చేసి గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. ఏజెన్సీలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీవో)ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని గిరిజన ఉత్పత్తుల్లో కాఫీకి ప్రపంచ గుర్తింపు ఉందని, అదే తరహాలో మిరియాలు, పసుపు పంటకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గిరిజన రైతులు దళారీల బారినపడకుండా ఉండేందుకు గిరిజన ప్రాంత ఉత్పత్తుల క్రయవిక్రయాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు చేపట్టాలని సూచించారు. అలాగే గిరిజన ఉత్పత్తుల్లో రోగనిరోధక శక్తి ఉండడంతో మార్కెట్‌లో గిరాకీ ఉందని, ఈ క్రమంలో నాణ్యతను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో ఎక్కువ మంది రైతులను సభ్యులు చేర్చాలని, పంటల ఉత్పత్తి, మార్కెట్ ధరలపైనా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కాఫీ, మిరియాలను గ్రేడింగ్ చేస్తున్నట్టుగా పసుపునకు ప్రోసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అందుకు గాను బ్యాంకులు సైతం రుణాలు అందిస్తాయని చెప్పారు. జిల్లాలో ఉన్న ఉత్పత్తులు, ప్రోసెసింగ్ యూనిట్‌ల వివరాలను సేకరించిన అధికారులు తనకు నివేదిక సమర్పించాలన్నారు. ఇకపై ప్రతి నెలా రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో వర్క్‌షాప్ నిర్వహించి, పంటల సంబంధ అంశాలపై చర్చ, భవిష్యత్తు కార్యాచరణకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, ఐటీడీఏ ఉద్యానవనాధికారి రాజశేఖరం, ఏజెన్సీ ప్రాంతంలోని రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్పెషల్ బీపీఎల్ మెగా టోర్నమెంట్‌ను ప్రారంభం


**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని బస్కీ పంచాయితీ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం శ్రీ శ్రీ శ్రీ రామ ఉయ్యాల పండుగ సందర్భంగా సంక్రాంతి స్పెషల్ బీపీఎల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివాసీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చట్టు మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు.బస్కీ గ్రామ పెద్దలు, యూత్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నమెంట్‌లో పలు జట్లు పాల్గొంటున్నాయి.

## నేడు అంగన్వాడీల సమస్యలపై ధర్నా



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని ప్రీస్కూల్ బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 12వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ఆందోళన జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్నా కరపత్రాన్ని అంబేద్కర్ భవన్లో విడుదల చేశారు . అంగన్వాడీలకు 2019 నుండి వేతనాలు పెరగనందున అంగన్వాడీలు వేతన సమస్యలు పరిష్కారం కోసం 2023 డిసెంబర్లో 42 రోజులు చేపట్టిన చారిత్రాత్మక సమ్మె విరమించినప్పటికీ అప్పటి ప్రభుత్వం 2024 జూలైలో వేతనాలు పెంచుతామని ఇతర సమస్యలు పరిష్కరిస్తామని మినిట్స్ ఇచ్చింది. ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం అప్పటి ప్రతిపక్షంలో ఉండగా తాము 2024లో అధికారంలో రాగానే వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసింది. గ్రాట్యూటీ ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు తాత్సారం చేస్తూ ఆచరణలో వేతనాలు పెంచడం లేదని అందుకే ఈ నెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లు వద్ద ఆందోళన నిర్వహిస్తున్నామని ఈ ఆందోళనలో అంగన్వాడీ వర్కర్లు, హెర్పర్లు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి అంగన్వాడీ లు వాణిని గట్టిగా వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు కె.కొండమ్మ కె.మహాలక్ష్మి, రంగ లక్ష్మి, రాయవరపు వరలక్ష్మి, సీరం రమణమ్మ ఎస్ అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

## 20న అనకాపల్లికి అటల్ మోదీ సుపరిపాలన యాత్ర



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అటల్ మోదీ సుపరిపాలన యాత్ర ను రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి ప్రారంభమవుతుందని జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు వెల్లడించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్రలో భాగముగా రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ నేతృత్వంలో ఈ నెల 20 న అనకాపల్లి కి యాత్ర చేరుతుందని చెప్పారు. అదే రోజు అనకాపల్లి ఫ్లై ఓవర్ దగ్గర అటల్ వాజపేయి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా లో ఉన్న కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ లు అందరూ సభలో పాల్గొంటారన్నారు. వాజపేయి దేశానికి అందించిన సేవలకు గుర్తుగా శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.మోడీ సుపరిపాలన ను గుర్తు చేస్తూ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశములో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబు, బీజేపీ ప్రధాన కార్యదర్శి బొడ్డెడ నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు పలకా రవి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ జనసేన నాయకులు హరి, బీజేపీ నాయకులు వర్మ తదితరులు పాల్గొన్నారు.

## దిబ్బపాలెం అభివృద్ధి పనులకు రూ. 45 లక్షల నిధులు

**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి నియోజకవర్గం లోని దిబ్బపాలం లో మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉపాధి హామీ నిధుల నుండి రూ. 45 లక్షల మంజూరు చేశారు. ఆదేశాలు మేరకు అనకాపల్లి నియోజక`వర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవకాలువ బ్రిడ్జి నుండి ముద్దుర్తి వరకు 45 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మించుట కొరకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాంకీ మాట్లాడుతూ ఇది కూటమి గ్రామం అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామ అభివృద్ధి దిశగా తీసుకుని వెళ్లాలని, ఈ గ్రామం సంబంధించిన స్మశానం, స్కూల్స్, ఇతర సమస్యలను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగాలని దానికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కర్రి బాబి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు చదరం నాగేశ్వరావు, గంగుపం జగదీష్, బంటి రవి, గ్రామజనసేన పార్టీ అధ్యక్షులు కర్ణం రాము, వైస్ సర్పంచ్, వార్డ్ మెంబర్స్, ఎన్టీఆర్ మార్కెట్ డైరెక్టర్, బిజెపి మండల ఉపాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సెక్రటరీ తదితరులుపాల్గొన్నారు.

# రీసర్వేతో తగ్గిన భూ విస్తీర్ణం



- ఆందోళనలో రైతాంగం
- తగ్గిన విస్తీర్ణాన్ని సరిచేయాలంటూ లక్షకు పైగా ఫిర్యాదులు
- ఆరు నెలల్లో 7,513 గ్రామాల్లో మళ్లీ సర్వేకు యాక్షన్ ప్లాన్

**అమరావతి, పతాకం న్యూస్:** భూములు రీసర్వే పూర్తయితే గ్రామాల్లో భూ సమస్యలు తీరిపోతాయని అన్నదాతలు ఆశిస్తుంటే మరొక వైపు లేనిపోని కొత్త సమస్యలు పుట్టుకురావడం పట్ల రైతాంగంలో ఆందోళన మొదలైంది. ఇప్పటి వరకు 26 జిల్లాల్లో 6,693 గ్రామాల్లో భూముల సర్వే ప్రక్రియ పూర్తయినట్లు రెవెన్యూ గణాంకాలు సూచిస్తున్నాయి. ఒక వైపు భూముల రీసర్వే పూర్తయిందని ఆనందపడేలోగా రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో భూముల విస్తీర్ణం మధ్య తేడా చూపిస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటి వరకు భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల నుంచి తమ భూ విస్తీర్ణం తగ్గిందంటూ, తమకు న్యాయం చేయాలని కోరుతూ 1,00,295 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. ఇంతపెద్ద సంఖ్యలో ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నా యంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఒక వైపు విస్తీర్ణం తగ్గుదలను సరిచేయాలంటూ వచ్చే వినతులు ఇబ్బడి ముబ్బడిగా పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నాల్గో విడత భూముల రీసర్వే కార్యక్రమాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మరో 10,123 గ్రామాల్లో భూముల రీసర్వే చేయాల్సి ఉండగా, అందులో 7,513 గ్రామాల్లోని భూములను సర్వే చేసేందుకు వీలుగా రూట్‌మ్యాప్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ప్రక్రియ 2026 జనవరి 2 నుంచి ప్రారంభించి జులై వరకు ఆరు నెలల కాలానికి షెడ్యూల్‌ను ప్రకటించింది. భూములు రీసర్వే చేసి ఆయా భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం ఒక ఎత్తయితే క్షేత్రస్థాయిలో భూముల విస్తీర్ణం, రికార్డుల్లో నమోదైన భూముల విస్తీర్ణ కొలతలు సరిపోకపోవడంతో సర్వే బృందాలు తలలు పట్టుకుంటు న్నాయి. అంతేకాకుండా భూ విస్తీర్ణం తగ్గిందని, ప్రాక్టికల్‌గా ఉన్న భూమిని రికార్డుల్లో నమోదు చేస్తుండటంతో రైతాంగం పెద్దయెత్తున ప్రభుత్వానికి ముఖ్యంగా పిజిఆర్ఎస్‌ఎలో ఫిర్యాదు లు చేస్తున్నారు. మ్యుటేషన్, పట్టా దారు పాస్‌పుస్తకాలకు సంబంధించి 1,97,915 ఫిర్యాదులు ప్రభుత్వానికి అందగా, అందులో క్లాసిఫికేషన్ సంబంధిత దరఖాస్తులు 1,00,835 రాగా, భూముల వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఇబ్బడి ముబ్బడిగా వస్తుండటంతోపాటు ఒకే అంశానికి సంబంధించి వరుసగా ఫిర్యాదులు అందుతుండటం పట్ల రెవెన్యూశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు ఆ శాఖ ఉద్యోగుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగుల వ్యవహారశైలి మారాలని, వివాదాల్లేకుండా, సమస్యను సున్నితంగా పరిష్కరించకుండా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచి ఆలస్యం చేయడం దేనికని అధికారులను సిఎం ప్రశ్నించారు. ఇది ఇలా ఉంటే మరో వైపు జాయింట్ ఎల్‌పిఎమ్‌లపై కూడా 2,40,479 ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. జాయింట్ ఎల్‌పిఎమ్‌లు టార్గెట్లు పూర్తి చేసే ప్రక్రియలో సిబ్బంది జాయింట్ ఎల్‌పిఎమ్‌లు సృష్టించడంతో రైతన్నల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. జాయింట్ ఎల్‌పిఎమ్‌లను విభజించి ఆ సర్వే నెంబరులోని భూ యజమానికి వాస్తవంగా ఎంత విస్తీర్ణం ఉందో అంతే విస్తీర్ణానికి సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాల్సి ఉండగా, అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో వ్యవహరించడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భూముల రీసర్వేకు సంబంధించి 6 నెలలకు సరిపడా యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. 2026 జనవరి 2 నుంచి మార్చి 24 వరకు 82 రోజుల పాటు గ్రౌండ్‌ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, మార్చి 25 నుంచి ఏప్రిల్ 3 వరకు ల్యాండ్‌పార్శిల్ మ్యాపింగ్‌లో తప్పులు సవరించడం, ఏప్రిల్ 4 నుంచి 8వ తేదీ వరకు (4 రోజులు) ప్రాంతాల వారీ స్టేట్‌మెంట్లను తయారు చేయడం, 9 నుంచి 18వ తేదీ వరకు విలేజ్‌సెక్రటరీ లాగిన్‌లో డేటా ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. 19.04.2026 నుంచి 23.04.26 వరకు విఆర్ఒ లాగిన్‌లో ఎంట్రీలు చేయాలి. అదే నెల 24 నుంచి 28 వరకు తహశీల్దార్ లాగిన్‌లో ల్యాండ్ రికార్డు గురించి డేటా నమోదు చేయాల్సి ఉంటుంది. 29.04.26 నుంచి మే 3 వరకు భూ యజమానులకు ఇవ్వాల్సిన నోటీసులు 9(2), 10(2) జారీ చేయడం, మే 4 నుంచి 28 వరకు అప్పీల్స్, 29 నుంచి జూన్ 2 వరకు రికార్డులు అప్‌డేషన్, జూన్ 3 నుంచి 7 వరకు ఆర్‌డిఓ లాగిన్‌లో నమోదు, జూన్ 8 నుంచి 12 వరకు జెసి లాగిన్ అవ్వడంతో పాటు ఫారం 13 నోటిఫికేషన్ జారీ చేయడం, జూన్ 13 నుంచి జులై 2 వరకు 20 రోజులు గడువులో ఫైనల్ ఆర్ఓఆర్ విడుదల చేయాలి.

## పీఎం జన్మన్ బిల్లులు వెంటనే చెల్లించాలి



**జీకే వీధి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా జీకేవీధి మండలం లో 16 పంచాయతీలలో ఉన్న పీఎం జన్మన్ మరియు గ్రామీణ హౌసింగ్ కు సంబంధించి పీఎం జన్మన్ బిల్లులు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వెంటనే చెల్లించాలని పివిటిజి కుటుంబాలు ఇతర కుటుంబాలు ఈ చలికాలం ఉండడానికి ఇల్లు లేక అనేకమంది గిరిజనులు ఇబ్బందులు ఎదురవుతున్నారు పీఎం జన్మన్ నిధులు వెంటనే విడుదల చేసి బిల్లులు చెల్లించాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా లక్ష రూపాయలు 75000 విడుదల చేయాలి చేయని యెడల ఉద్యమం తప్పదని మర్రికాయ ఆదిమా జాతి సేవా సంఘం మండల అధ్యక్షులు కొర్ర జగన్ సభ్యులు పి కృష్ణ సూరిబాబు బాలయ్య కొండబాబు రాంబాబు పాల్సు శోభన వెంకటేశు సాలు డిమాండ్ చేశారు

# భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



**కాకినాడ, పతాకం న్యూస్:** పిఠాపురం మహారాజా దానం చేసిన ఆనంద నిలయంకు చెందిన సుమారు రూ.1000 కోట్ల ఆస్తి ఆక్రమణ, ఐటీ సెజ్ అభివృద్ధి, కాకినాడ నగర అభివృద్ధి తదితర అంశాలపై గురువారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి పూర్తి వివరాలతో నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ విద్యా వికాసం కోసం దాతలు దానం చేసిన భూముల అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, దాతల ఆశయానికి తూట్లు పొడుస్తూ రూ.వెయ్యి కోట్లు విలువైన ఆనంద నిలయం భూమిపై అక్రమార్కుల పాగా, అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రికి వివరించి భూ ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందని తెలిపారు. అదే విధంగా కాకినాడ సర్పవరం నందు ఉన్న ఐటీ సెజ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరామన్నారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సమాచార సాంకేతిక విద్యని అభ్యసించిన యువత అభివృద్ధి కోసం కాకినాడ సర్పవరం గ్రామంలో భూమి కేటాయించి ఐటీ-సెజ్ కు అంకురార్పణ చేయడం జరిగిందన్నారు. ఐటీ-సెజ్ అభివృద్ధి కోసం 25.73 ఎకరాలు కేటాయంచడం జరగగా అందులో 15.14 ఎకరాలు అభివృద్ధి చేయగా, మిగిలిన భూమి అంటే 10.59 ఎకరాలు రోడ్లు, ఇతర అవసరాలకు కేటాయించడం జరిగిందన్నారు. ఇంకా అందుబాటులో ఉన్న భూమిని స్టార్ట్ అప్ కంపెనీలకు కేటాయించి కాకినాడ ఐటి సెజ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. అలాగే కాకినాడ నగరం మరింత అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించి స్మార్ట్ సిటీ నిధులు కేటాయించాలని కోరడం జరిగిందని ఎమ్మెల్యే స్థానిక విలేకరులకు తెలిపారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. నాలుగు నియోజకవర్గాల్లోని 23 రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.42.37 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే 80.249 కిలోమీటర్ల పొడవున రహదారులను నిర్మించనున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. గ్రామీణ ప్రాంత రోడ్లకు ఒక్క రూపాయి కేటాయించలేదు. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులకు అనుసంధానంగా ఉన్న పల్లె రోడ్లన్నింటినీ నిర్లక్ష్యం చేసింది. దీంతో ఎక్కడికక్కడ గుంతలు పడ్డాయి. అడుగుకో గొయ్యి ఏర్పడడంతో ద్విచక్ర వాహన దారులు అదుపుతప్పి కింద పడేవారు. ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ఆసుపత్రి పాలయ్యారు. అత్యధిక గ్రామాలకు అనుసంధానంగా వున్న ప్రధాన రహదారులను కూడా బాగు చేసేందుకు ఆలోచన చేయలేదు. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్లను బాగు చేయాలని నిర్ణయించింది. బాగా పాడైన రోడ్లను తొలుత మార్చాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకుంటోంది. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కి) కింద నాబార్డ్ ఈ నిధులను కేటాయించింది. రోడ్లును బాగు చేయనుండడంతో ఆయా గ్రామాల ప్రజల నుంచి అనందం వ్యక్తమవుతోంది.

## బలిమెల నీటి వినియోగంపై సమీక్ష




**సీలేరు, పతాకం న్యూస్:** ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగం, నిర్వహణపై ఇరు రాష్ట్రాల అధికారులు ఒడిశాలోని చిత్రకొండ వోహెచ్‌పీసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025- 2026 నీటి సంవత్సరానికి సంబంధించి 2025 జూలై నుంచి నవంబరు 30 వరకు ఏ రాష్ట్రం తమ వాటాగా ఎన్ని టీఎంసీల నీటిని వినియోగించుకుందో లెక్కలు కట్టారు. దీని ప్రకారం ఆంధ్ర ఇప్పటి వరకు తన వాటాగా 20.3513 టీఎంసీల నీటిని వినియోగించుకుందని, ఒడిశా 45.5667 టీఎంసీలు వినియోగించుకున్నట్టు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఒడిశా, ఆంధ్రా కంటే 25.2154 టీఎంసీలను అధికంగా వినియోగించుకున్నట్టు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 78.4000 టీఎంసీలు, జోలాపుట్టులో 28.5451 టీఎంసీలు కలిసి మొత్తంగా 106.9451 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని గుర్తించారు. ఈ నెలాఖరు నాటికి బలిమెల జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 3.5000 టీఎంసీలు, జోలాపుట్టుకు 2.5000 టీఎంసీలు పరివాహక ప్రాంతాల నుంచి వచ్చి చేరతాయని, వీటితో కలిపి రెండు జలాశయాల్లో మొత్తంగా 112.9451 టీఎంసీలు నిల్వలు ఉన్నట్టు లెక్కలు కట్టారు. ఇందులో ఆంధ్రా వాటా 69.0803 టీఎంసీలు, ఒడిశా వాటాగా 43.8648 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్రా రెండు వేల క్యూసెక్కులను, ఒడిశా 3 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో ఒడిశా తరఫున పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజనీర్ కృపకుమార్ పాత్రో, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ రమాకాంత పాత్ర, పొట్టేరు కెనాల్ డివిజన్ ఎస్ఈ సనోజ్ సాహూ, బలిమెల వోహెచ్‌పీసీ మేనేజర్ బిమల టర్కీ, డిప్యూటీ మేనేజర్ క్షుణిష్ చంద్రబెహరా, అసిస్టెంట్ మేనేజర్ సుబదీప్ పండా, ఎర్త్‌డ్యాం ఏఈఈలు దిలీప్‌కుమార్, కృష్ణచంద్ర ఫణి, గడాధర్ ప్రధాన్‌లు పాల్గొనగా, ఆంధ్రా తరఫున సీలేరు కాంప్లెక్సు సివిల్ వోఅండ్ఎం సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఈఈ ఎస్.జైపాల్, ఏఈఈ సీహెచ్ సురేశ్ పాల్గొన్నారు.

## అటవీ హక్కులపై అవగాహన కల్పించండి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** అటవీ హక్కుల చట్టంపై గిరిజనులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఐటీడీఏలో ఎన్‌జీవో ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. వారి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కార మార్గం చూపాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఆర్ఏ విభాగపు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.ఆదినారాయణరావు, ఏపీవో మురళీధర్, ఆర్‌వోఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పలాస మండలంలోమళ్లీ యథేచ్ఛగా సాగుతున్నా కంకర తవ్వకాలు



**పలాస, పతాకం న్యూస్:** పలాస మండలంలో కంకర తవ్వకాలు మళ్లీ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల కేదారిపురం, లొద్దభద్ర, రాజగోపాలపురం ప్రాంతాల్లో కొండల వద్ద కంకరను యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ట్రాక్టర్లతో అక్రమ రవాణా సాగించారు. కేదారిపురం పంచాయతీ కంబిరిగాం వద్ద కంకర డంపింగ్ చేశారు. అలాగే రామకృష్ణాపురం ఉజ్జుడిమెట్ట వద్ద కంకర తవ్వకాలు చేపట్టారు. దీనిపై పత్రికల్లో కథనాలు రాగా.. మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కంబిరిగాం వద్ద డంపింగ్‌పై జరిమానా విధించారు. దీంతో అక్రమార్కులు కొన్నిరోజులపాటు తవ్వకాలు నిలిపివేశారు. కానీ మళ్లీ గత మూడు రోజుల నుంచి గంగువాడ ప్రాంతంలోని కొండల అంచుల్లో ఉన్న కంకరను గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళ తవ్వేసి.. ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుని.. కంకర తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## కొయ్యూరులో వాటర్ షెడ్ మహోత్సవంలో ఈశ్వరి- స్థానిక ఎన్నికల్లో ఏకతాటిపై పనిచేయాలని సూచన



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరులో నిర్వహించిన వాటర్ షెడ్ మహోత్సవం కార్యక్రమానికి పాడేరు నియోజకవర్గ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు పోలుపర్తి గోవింద్(మాస్టర్) కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా, అంకితభావంతో పనిచేయాలని,గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను తీర్చడంలో మన కర్తవ్యాన్ని నిబద్ధతతో కొనసాగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల కూటమి నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి



**అనంతపురం, పతాకం న్యూస్:** వజ్రకరూరు మండలంలోని రాగుల పాడు, కొనకొండ్ల గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారలకు ఆదేశించారు. వాటిని పరిశీలించిన ఆయన మా ట్లాడారు. ఈ భవనాల నిర్మాణానికి నిధులు ఉన్నా యని, పేమెంట్‌లకు ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నా రు. అనంతరం ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. స్థానిక 1వ వార్డులో తాగునీటి సమ స్య తీర్చాలని, విద్యుత స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. భూవివాదం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వోపైన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్, డీఎల్‌డీవో విజయలక్ష్మి, తహసీల్దారు నరేష్, ఎంపీడీవో శివాజీ రెడ్డి, ఏఈ మణిభూషణ్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి ఉన్నారు.

## ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రహదారులు, గృహాలు, పింఛన్లు, మంచినీటి సరఫరా సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్‌కార్యాలయంలో గరుగుబిల్లి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ మండలాధ్యక్షుడు మరడాన నారాయ ణస్వామినా యుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. రాను న్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు.

## ఆదోని జిల్లా కోసం రిలే దీక్షలు



**ఆదోని, పతాకం న్యూస్:** ఆదోని జిల్లాగా ప్రకటించాలని ఆదోని జిల్లా సాధన జేఏసీ గౌరవ అధ్యక్షుడు కమలే గణేష్, జేఏసీ నాయకులు సత్యనారాయణ రెడ్డి, మల్లెల అల్ఫ్రెడ్‌రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో జే ఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోని కర్నూల్‌లోని పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని పత్తికొండ, అలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆదోనిని జిల్లాగా ప్రకటించకుండా ఉండడం దారుణమన్నారు. ఆదోని జిల్లాగా ప్రకటిస్తే పశ్చిమ ప్రాంతం లో మెరుగైన విద్య, వైద్యం, సాగు, తాగు నీరు, పరిశ్రమలు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేసి పశ్చిమ ప్రాంతంలోని ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. రిలే నిరాహార దీక్షకు ప్రజా సంఘాలు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ప్రసాద్, సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగన్న, బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మినారాయణలు మద్దతు తెలిపారు. జేఏసీ నాయకులు శేఖర్, ఉదయ్, కృష్ణ, ఆఫ్రీది దీక్షలో పాల్గొన్నారు.

## నిలిచిన ఎంఆర్ఐ సేవలు



**కర్నూలు, పతాకం న్యూస్:** ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు రోజులుగా ఎంఆర్ఐ (మాగ్నెటిక్ రెసోనెన్స్ ఇమేజింగ్) సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. సర్వర్ మొరాయించడంతో కొత్త కేసులను సిబ్బంది తీసుకోవడం లేదు, ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన పాత కేసులను మాత్రమే చేస్తూ కొత్త కేసులను వెనక్కు పంపుతున్నారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ సేవలను పీపీపీ కింద విజయవాడకు చెందిన ప్రమోదీని మెడికల్ కేర్ నిర్వహిస్తుంది. రోజూ దాదాపు 70 మంది రోగులకు ఎంఆర్ఐ పరీక్షలు నిర్వహిస్తారు. న్యూరోసర్జరీ, న్యూరాలజీ, మెడికల్ సర్జరీ, ఆర్థో, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల నుంచి రోగులు ఎక్కువగా వస్తుంటారు. రెండు రోజులుగా నూతన కేసులు తీసుకోకపోవడంతో దాదాపు 150 మంది రోగులు ఎదురు చూస్తున్నారు.

# రైల్వే స్టేషన్లలో సమస్యలు తిష్ఠ



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలోని రైల్వే స్టేషన్లలో సమస్యలు తిష్ట వేశాయి. మౌలిక వసతులు కొరవడ్డాయి. ప్రధాన రైళ్లకు కూడా హాల్ట్ ఉండక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ విజయనగరం, విశాఖకు చేరుకోవాల్సి వస్తోంది. మరోవైపు రైల్వే గేట్ల సమస్య కూడా ప్రయాణికులు, వాహనదారులను వేధిస్తోంది. రెండు కిలోమీటర్ల లోపు మూడు రైల్వేగేట్లు ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒకసారి గేటు పడితే సుమారు 20 నుంచి 25 నిమిషాల పాటు గేటుకు ఇరువైపులా వాహనదారులు నిరీక్షించాల్సి వస్తోంది. ఇదే సమ యంలో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు దీరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ఇకపోతే సాలూరుకు రైలు ఎప్పుడోస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్పితే.. రైలు వచ్చే మార్గం చూడడం లేదు. దీంతో ఆయా ప్రాంతవాసులు పెదవి విరుస్తున్నారు. మొత్తంగా జిల్లాలో రైల్వే శాఖ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లకు మోక్షం లభించడం లేదు. జిల్లాలో పార్వతీపురం, బెలగాం, గుమడ, సీతానగరంలో రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఇక నర్సిపురంలో పాసింజర్ రైళ్లకు మాత్రమే హాల్ట్ సదుపాయం కల్పించారు. కాగా దేశంలో ఎక్కడా లేని విధంగా పార్వ తీపురం పట్టణంలో రెండు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. బెలగాం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌తో పాటు పాసింజర్ రైళ్లకు హాల్ట్‌లు ఉన్నాయి. కొత్తవలస పరిధిలో ఉన్న టౌన్ రైల్వేస్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ , పాసింజర్ రైళ్లు మాత్రం నిలుస్తాయి. కిలోమీటరు దూరంలో ఈ రెండు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. అమ ృత్ భారత్ పథకంలో భాగంగా బెలగాం స్టేషన్‌ను అభి వ ృద్ధి చేస్తున్నారు. 22 ప్రయాణికులు, 60 వరకు గూడ్స్ రైళ్లు నడుస్తున్నాయి. అయితే ఆయా స్టేషన్లలో ప్రయాణికుల విశ్రాంతి కోసం చిన్న గదిని మాత్రమే కేటాయించారు. ఏసీ ప్రయాణికులకు ప్రత్యేక విశ్రాంతి రూమ్ లేదు. ఇక బెలగాం రైల్వే స్టేషన్ పరిధిలో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వల్ల ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్లు వద్ద ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. సీనియర్ సిటిజన్లు, చిన్నారులతో మెట్లు ఎక్కి దిగడం కష్టతరంగా మారింది. ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని గతంలో రైల్వేశాఖ ఉన్నతా ధికారులు చెప్పినా.. ఆ దిశగా ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

కొమరాడ మండలంలో సుమారు మూడు కిలోమీటర్ల లోపు మూడు రైల్వేగేట్లు ఉన్నాయి. ప్రతి పది నుంచి 15 నిమిషాలకు గేట్లు పడుతుం డడంతో వాహనదారులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. వాస్తవంగా ఇది అంతర్రాష్ట్ర రహదారి. నిత్యం వేలాదిగా ఒడిశా- ఆంధ్రా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రైల్వే గేట్లతో వాహనదారులంతా తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు. జిల్లా కేంద్రంలో బెలగాం వద్ద ఉన్న రైల్వే గేటు వల్ల సుమారు 15 గ్రామాలతో పాటు పట్టణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అత్యవసర వేళల్లో చాలామంది వైద్య సేవలు కూడా పొందలేక పోతున్నారు. మూడో రైల్వే మార్గం వేసిన తర్వాత తరచూ స్టేషన్ సమీపంలోనే గేట్ పడుతుండడంతో చోదకులకు నిరీక్షణ తప్పడం లేదు.

గతంలో సాలూరులో రైల్వేస్టేషన్ మీదుగా సాలూరు-బొబ్బిలి మధ్య రైలు బస్ నడిచేది. కరోనా కాలంలో ఆ సర్వీసును నిలిపేశారు. ఇప్పటికీ దానిని పునరుద్ధరించకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపా రులు, గ్రామీణులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా సాలూరు నుంచి విశాఖపట్నం వరకు రైలు నడుపుతామని గతంలో రైల్వేశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌లో చకా చకా పనులు చేశారు. దీంతో సాలూరు వాసులు ఎంతో సంబరపడ్డారు. అయితే వారి ఆనందరం ఎంతో కాలం నిలవలేదు. రైల్వే శాఖ ఉన్నతా ధికారులు ప్రకటించి నెలలు గడుస్తున్నా.. ఇంకా ఆ రైలు మాత్రం రాలేదు. ప్రస్తుతం సాలూరు రైల్వేస్టేషన్ పిచ్చిమొక్కలతో అధ్వానంగా దర్శన మిస్తోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారానికి పలుమార్లు ఆశాఖ ఉన్నతాధికారులకు వినతులు ఇస్తున్నా.. ఫలితం శూన్యం. స్టేషన్ల అభివ ృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకో వడం లేదు. వాస్తవంగా పార్వతీపురం టౌన్, బెలంగా రైల్వే స్టేషన్ల నుంచి భారీగానే ఆదాయం వస్తున్నా.. సౌకర్యాల కల్పనపై ఆ శాఖ అధికారులు ద ృష్టి సారించడం లేదు. ఫలితంగా ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధి కారులు రైల్వే శాఖపై ఒత్తిడి తెచ్చి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మన్యం వాసులు కోరుతున్నారు.

# వెయ్యి గజాల స్థలం ఆక్రమణ.. మాకెందుకులే అంటున్న అధికారులు

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీకి చెందిన విలువైన స్థలాలు ఒక్కొక్కటిగా అన్యాక్రాంతమైపోతున్నాయి. తాజాగా 34వ వార్డు పరిధిలో రామకృష్ణా పార్కును ఆనుకుని ఉన్న సుమారు వెయ్యి గజాల స్థలాన్ని కొందరు ఆక్రమించి అద్దెకు ఇచ్చారంటూ స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అయినా చర్యలకు మీనమేషాలు లెక్కిస్తుండడం అనుమానాలకు దారితీస్తోంది. జీవీఎంసీ 34వ వార్డులో రామకృష్ణా రైతుబజార్ సమీపాన నగర పాలక సంస్థకు పార్కుతోపాటు మరికొంత స్థలం ఉంది. పార్కు పక్కనున్న స్థలం పరిరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారు. స్థానికంగా పలుకుబడి కలిగిన ఒక రాజకీయ నాయకుడు ఆ స్థలంలో 330 గజాలను తాను కొనుగోలు చేశానని ప్రకటించుకున్నారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి కావడంతో ఎవరూ పత్రాలు చూపించాలని అడిగే సాహసం చేయలేదు. తర్వాత తాను కొనుగోలు చేసినట్టు చెప్పిన స్థలానికి, పార్కుకు మధ్యలో ఉన్న జీవీఎంసీకి చెందిన సుమారు వెయ్యి గజాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ స్థలం విలువ ఇప్పుడు మార్కెట్‌లో దాదాపు రూ.ఐదు కోట్లు ఉంటుందని అంచనా. తర్వాత ఆ స్థలం అంతటినీ వేరొకరికి అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఒక కార్పొరేటర్ జీవీఎంసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకుని అద్దెకు ఇచ్చినట్టు పేర్కొంటూ ఆధారాలతో జీవీఎంసీ కమిషర్ర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి జీవీఎంసీకి చెందిన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయినా ఇంతవరకూ దీనిపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



రూ.కోట్లు విలువైన జీవీఎంసీ స్థలాన్ని పరిరక్షించాలని ఆధారాలతో స్థానికులు పోరాడుతున్నాసరే అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆదోని పత్తి మిల్లులో భారీ అగ్నిప్రమాదం కోట్లలో ఆస్తి నష్టం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆదోని పట్టణంలో వరుసగా పత్తి జిన్నింగ్ మిల్లుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుండడంతో యజమానులు బెంబేలెత్తుతున్నారు. గురువారం తెల్లవారుజామున ఆదోని శివారులో ఉన్న ఎన్ డీ బి ఎల్ పత్తి జిన్నింగ్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి భారీగా నిలువచేసిన పత్తి దూది బెల్లులు మంటలకు ఆహుతై బూడిద అయ్యాయి. విషయం తెలుసుకున్న యజమాని బత్తిని కుబేర్నాథ్ మంటలను చూసి విషాదంలో మునిగిపోయారు. మంటలు విస్తరిస్తుండడంతో అదుపు చేసేందుకు నాలుగు ఫైర్ ఇంజన్లు సరిపోక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. సుమారు ఐదు కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉండేవచ్చని ఫైర్ అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం బసాపురం రోడ్డులో ఉన్న హరి కాటన్ మిల్లులో విద్యుత్ ప్రమాదం వల్ల భారీ నష్టం జరిగింది. సుమారు రెండు కోట్ల వరకు విలువ చేసే పత్తి కాలిపోయింది. వరుసగా అగ్ని ప్రమాదాలు వల్ల ఆదోనిలో పత్తి చిన్ని ఫ్యాక్టరీల యజమానులు ఆందోళనకు గురి అవుతున్నారు.

# మీ గుండె ఆరోగ్యంగా ఉండాలా?

## జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలని వైద్యుల సూచన

చిన్నా పెద్దా తేడా లేకుండా ఎంతో మందిని కబళిస్తున్న అతిపెద్ద సమస్య గుండెపోటు. ఈ ప్రాణాంతక సమస్య నుంచి బయటపడేందుకు అందరూ.. హైబీపీ, డయాబెటిస్, ఒబెసిటీ, అధిక కొలెస్ట్రాల్ చెక్ చేసుకుంటున్నారు. ఇంకా కుటుంబంలో ఎవరికైనా గుండెజబ్బు ఉందా? అనేది చూస్తున్నారు. ఇందులో సమస్య లేకపోతే అంతా బాగుందని, గుండె బలంగానే ఉందని అనుకుంటూ ఉంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. ధమనులలో ఏర్పడే అడ్డంకుల కారణంగా కూడా గుండెపోటు, స్ట్రోక్? వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ధమనుల్లో ఫలకం ఏర్పడటానికి, గుండెపోటు ప్రమాదాన్ని పెంచడానికి అవకాశం ఉన్న ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం! పొగాకు వాడకం, అధిక ఉప్పు, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, మద్యం సేవించడం అన్నింటి కంటే ముఖ్యంగా, అనారోగ్యకరమైన ఆహారం వంటి అంశాలు ధమనులలో ఫలకం (అథెరోస్క్లెరోసిస్) పేరుకుపోవడాన్ని వేగవంతం చేస్తాయని అధ్యయనం పేర్కొంది.



గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులే కీలకం. ఇవి గుండె కండరానికి రక్తాన్ని చేరవేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ధమనుల్లో పూడికలు ఏర్పడితే రక్తం సరిగా సరఫరా కాదంటున్నారు. సాధారణంగా కొవ్వు, కొలెస్ట్రాల్ పోగుపడి పూడికలుగా మారుతుంటాయని, వీటి మూలంగా రక్తం అందని గుండె భాగం ఆక్సిజన్ కొరవడి, చచ్చుబడటం మొదలవుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, గుండెపోటు, స్ట్రోక్ లాంటివి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పకోడీలు, సమోసాలు, ఫ్రైడ్ చికెన్ వంటివి తినడానికి రుచికరంగా ఉంటాయి. కానీ, ఇవి మరగకాగిన నూనెలో చేయడం వల్ల, నూనె ఆక్సిడైజ్ చెంది ట్రాన్స్‌ఫ్యాట్స్‌ని ఉత్పత్తి చేస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాకుండా, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను పెంచడంతోపాటు వాపును ప్రేరేపిస్తాయని చెబుతున్నారు. ఈ క్రమంలో తరచూ డీప్ ఫ్రై ఫుడ్స్ ఎక్కువగా తినడం వల్ల ధమనుల్లో ప్లేక్ ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

సాసేజ్‌లు, బేకన్, సలామీలలో శాచ్యురేటెడ్ ఫ్యాట్, సోడియం, నైట్రేట్లు, ఇతర ప్రిజర్వేటివ్?లు ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి ధమనుల గోడలపై పేరుకుపోయి అడ్డంకులకు దారి తీస్తాయని చెబుతున్నారు. అలాగే, రక్తనాళాల వాపు, పనితీరును ప్రభావితం చేస్తాయని పేర్కొంటున్నారు. ఫలితంగా, గుండెజబ్బు సమస్యలకీ కారణమవుతుందని తెలియజేస్తున్నారు. బ్రెడ్, పేస్ట్రీలు, స్వీట్లు, చక్కెర పానీయాలు రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచుతాయంటున్నారు నిపుణులు. ఇది ట్రైగ్లిజరైడ్స్‌ను పెంచడంతోపాటు ధమనుల చుట్టూ కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొంటున్నారు. దీర్ఘకాలంలో డయాబెటిస్ కారణమవుతుందని తెలియస్తున్నారు. డయాబెటిస్ - ధమని గోడలను దెబ్బ తీస్తుందని అధ్యయనం పేర్కొంది. ఫలితంగా, గుండె జబ్బుల ప్రమాదం పెంచుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిప్స్, నమ్కీన్‌లు, బిస్కెట్లు, బేక్ చేసిన జంక్ ఫుడ్‌లలో తరచుగా హైడ్రోజనేటెడ్ నూనెలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ట్రాన్స్ ఫ్యాట్స్, చెడు కొలెస్ట్రాల్?ను పెంచడమే కాకుండా మంచి కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తాయంటున్నారు. దీనివల్ల రక్తనాళాలు వేగవంతంగా సన్నబడతాయని పేర్కొంటున్నారు. ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్యాకేజ్ చేసిన సూప్‌లు, ఊరగాయలు, చిప్స్, రెస్టారెంట్ భోజనాలలో తరచుగా సోడియం ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. అధిక ఉప్పు తీసుకోవడం వల్ల బీపీ పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే, ధమని గోడలు దెబ్బతీయడంతోపాటు ఫలకం పేరుకుతుందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సోడియం తగ్గించాలని కార్డియాలజిస్టులు పదేపదే సలహా ఇస్తున్నారు. అధిక ఉప్పు ఆహారం అధిక రక్తపోటుతో దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది. అథెరోస్క్లెరోసిస్‌కు ఒక ముఖ్యమైన కారణమని అధ్య యనం పేర్కొంది. ఎనర్జీ డ్రింక్స్ గుండె వేగాన్ని, రక్తపోటును పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు.

# పాలలో వీటిని కలిపి రాస్తే చర్మంపై మచ్చలు తగ్గుతాయి





పాలు, పాత ఉత్పత్తులు స్కిన్‌కి మేలు చేస్తాయి. ముఖ్యంగా చర్మంపై ఉన్న దుమ్ముని దూరం చేసి కాంతివంతంగా మారుస్తుంది. వీటిని సరిగ్గా వాడితే స్కిన్ మెరిసిపోతుంది. అది ఎలానో, పాలు ఎలా వాడితే చర్మం నిగనిగలాడుతుందో తెలుసుకోండి. పచ్చిపాలల్లో లాక్టిక్ యాసిడ్, కాల్షియం, విటమిన్స్ బి12, బి6,ఎ, డి2 , ప్రోటీన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవన్నీ కూడా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో మచ్చలేని, మెరిసే చర్మాన్ని కూడా పొందొచ్చు. ఈ పాలని చర్మానికి ప్యాక్‌లా ఎలా వేసుకోవచ్చో చూద్దాం.

పాలు అవకాడో ప్యాక్: ముందుగా అవకాడోని పొట్టుతీసి సగం వరకూ ముక్కలు చేసి మెత్తగ చేయాలి.ిందులో పచ్చిపాలు కలిపి పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి అప్లై చేసే ముందు ముఖాన్ని ముందుగా క్లీన్ చేయాలి. తర్వా పేస్ట్‌ని అప్లై చేసి పూర్తిగా ఆరిపోయే వరకూ అలానే ఉంచి ఆరిపోయాక గోరువెచ్చని నీటితో క్లీన్ చేసుకోండి. దీనిని వారానికి రెండుసార్లు చేస్తే నల్లగా మారిన ముఖం కూడా మెరిసిపోతుంది.

పాలు, పసుపుతో ప్యాక్: పచ్చిపాలను ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో పసుపు కలిపి పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తర్వాత చల్లని నీటితో కడుక్కుంటే ముఖం చక్కగా మెరిసిపోతుంది. దీనిని రోజూ కూడా వాడొచ్చు. ఈ ప్యాక్ ఉదయం కంటే రాత్రి రాయడం వల్ల ఎక్కువగా లాభం ఉంటుంది.

పాలు బాదం ప్యాక్:

కావాల్సిన పదార్థాలు: పచ్చి పాలు 4 చెంచాలు, బాదంపప్పులు 6 వాడే విధానం.. బాదంపప్పుని పాలల్లో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే తొక్కు తీసి మెత్తని పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి ప్యాక్‌లా వేసి 20 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోండి. చర్మంపై మృతకణలను తొలగించి మంచి రంగునివ్వడంలో ఈ ప్యాక్ హెల్ప్ చేస్తుంది.

పాలు, తేనె, నిమ్మరసంతో: కావాల్సిన పదార్థాలు.. పచ్చిపాలు 3 చెంచాలు, తేనె 1 చెంచా, నిమ్మరం 1 చెంచా,

తయారీ విధానం: ముందుగా పచ్చిపాలలో తేనె, నిమ్మరసం వేసి బాగా కలపాలి. దీనిని ముఖానికి అప్లై చేసి ఆరనివ్వాలి. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో క్లీన్ చేసుకోవాలి. పాలలోని క్లెన్సింగ్ గుణాలు, తేనెలోని మాయిశ్చరైజింగ్ గుణాలు, నిమ్మలోని బ్లీచింగ్ గుణాలు కలిసి మృత చర్మ కణాలను తొలగించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి.ఈ ప్యాక్‌ని వారానికి 2 నుంచి 3 సార్లు వేసుకోవచ్చు.పాలు శనగపిండి, ముల్తానీ మట్టి..

పాలు శనగపిండి, ముల్తానీ మట్టి: కావాల్సిన పదార్థాలు..

శనగపిండి 1 చెంచా, ముల్తానీ మట్టి 1 చెంచా, పాలు 2 చెంచాలు. తయారీ విధానం: ముల్తానీ మట్టి, శనగపిండిలో పాలు వేసి పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి అప్లై చేసి 20 నుంచి 30 నిమిషాల అలానే ఉండండి. తర్వాత చల్లని నీటిని స్ప్రే ముఖాన్ని కొద్దిగా స్క్రబ్ చేస్తూ చల్లని నీటితో కడగండి, ఇలా వారానికి ఒకటి, రెండు సార్లు చేస్తే చర్మం నిగనిగలాడుతుంది.

# మెప్మాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆర్పీలు

## వెలుగులోకి మరికొన్ని బోగస్ గ్రూపులు.. రోజూ ఒక్కొక్క రి అవినీతి బాగోతం బహిర్గతం




**ఒంగోలు, పతాకం న్యూస్:** : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపుల వ్యవహారం తవ్వేకొద్దీ బయటపడుతోంది. రోజుకో అక్రమం వెలుగుచూస్తోంది. మొన్న పేర్నమిట్టకు చెందిన పార్వతి అనే ఆర్పీ, నిన్న కేశవస్వామిపేట బాధ్యతలు చూసే ఆర్పీ దివ్యశాంతి అవి నీతి బయటపడింది. తాజాగా మరికొందరు సభ్యులు తామూ మోసపోయామంటూ రోడ్డెక్కుతున్నారు. మామిడిపాలెంకు చెందిన ఆర్పీ విజయలక్ష్మి పీడీసీసీ బ్యాంక్ టౌన్ బ్రాంచ్‌లో తమకు తెలియకుండా, సంతకాలు కూడా లేకుండా తమ ఆధార్ కార్డులతో గ్రూపులు తయారు చేసి భారీగా రుణాలు తీసుకున్నట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. లక్ష్మీనరసింహ స్వశక్తి సంఘం, లక్ష్మి పొదుపు గ్రూపు, పోలేరమ్మ స్వశక్తి సంఘం, శ్రీకృష్ణ స్వశక్తి సంఘం, గ్లోరీ స్వశక్తికి చెందిన సభ్యులు తాము మోసపోయినట్లు గుర్తించి బ్యాంకర్ల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం. తమకు సంబంధం లేకున్నా బ్యాంకుల్లో రూ.లక్షల్లో అప్పు ఉన్నట్లు తెలిసి వారందరూ లబోదిబోమంటున్నారు. దీనిపై విచారణ చేపట్టి తమను రుణవిముక్తులను చేయాలని కోరుతు న్నారు. అయితే ఆర్పీ విజయలక్ష్మి కేవలం ఈ ఐదు గ్రూపుల సభ్యులతో చేసినవే కాకుండా మరికొన్ని బోగస్ గ్రూపులు కూడా సృష్టించి నెల్లూరు బస్టాండులోని ఇంకో జాతీయ బ్యాంకులో కూడా రుణాలు తీసుకున్నట్లు సమాచారం. పైన పేర్కొన్న ఐదు గ్రూపుల సభ్యుల విన్నపాన్ని పరిగణ నలోకి తీసుకున్న పీడీసీసీ బ్యాంకు టౌన్ బ్రాంచ్ అధికారులు విచారణ చేపట్టగా బోగస్ విషయం వాస్తమని తేలినట్లు సమాచారం. ముఖ్యంగా గ్రూపుసభ్యుల ఫొటోలు లేకుండా, సంతకాలు ఫోర్జరీ చేయడంతోపాటు, బ్యాంకర్లను సైతం బురిడీ కొట్టించి రూ.లక్షల్లో దోచేసినట్లు తెలుస్తోంది. అయితేప్రస్తుతానికి కొందరు ఆర్పీల అక్రమాలు మాత్రమే బయటకొస్తుండగా, ఇంకా అనేకమంది ఇదే తరహా అవినీతికి పాల్పడినట్లుగా సమాచారం. వారి చేతిలో మోసపోయిన మహిళలకు ఇంకా బ్యాంకుల నుంచి నోటీసులు రాకపోవడంతో బయటకు పొక్కలేదు. గతంలో అవినీతికి పాల్పడ్డ ఆర్పీలపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా వారు బొక్కేసిన సొమ్మును తిరిగి కట్టించలేదు. దీంతో మిగతా వారు మరింత రెచ్చిపోతున్నారు. అమాయక మహిళలను మోసం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మెప్మాలో చోటుచేసుకున్న అవినీతిపై క్షేత్రస్థాయి నుంచి లోతుగా అధ్యయనం చేస్తే మరి కొంతమంది ఆర్పీల మోసాలు బయటకొచ్చే అవకాశం ఉందని బాధితులు అంటున్నారు. చీమకుర్తి మునిసిపాలిటీలోని మెప్మాలోనూ అంతులేని అవినీతి చోటుచేసుకుంది. అక్కడి టౌన్ మిషన్ కోఆర్డినేటర్ కనుసన్నల్లో ఈ వ్యవహారం జరిగినట్లు తెలుస్తోంది. 12 బోగస్ గ్రూపులు తయారుచేసి భారీగానే బొక్కేసినట్లు సమాచారం. చీమకుర్తి మునిసిపాలిటీ టౌన్ మిషన్ కోఆర్డినేటర్‌గా పూర్తిస్థాయి అధికారి లేరు. దీంతో అర్హత లేని వారికి ప్రత్యేకించి మొన్నటి వరకు ఒంగోలులో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా (సీవో)గా పనిచేసిన ఓ ఉద్యోగికి ఇన్‌చార్జి టీఎంసీగా బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వెనుక జిల్లా అధికారి చేతివాటం భారీగానే ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఆ అధికారి అండదండలను ఆసరాగా చేసుకుని సదరు ఇన్‌చార్జి టీఎంసీ రెచ్చిపోయారు. అక్కడి కార్యాలయ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడంతోపాటు ఒంగోలు మెప్మా కార్యాలయంలోనూ ఆమె పెత్తనం చేయడంపై జిల్లావ్యాప్తంగా మెప్మాలో చర్చ నడుస్తోంది. ఆమె ప్రభుత్వం ఆదేశించిన కార్యకలాపాలకన్నా బోగస్‌పైనే కన్నేసినట్లు తెలుస్తోంది. అయితే చీమకుర్తి మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి, టీఎంసీ నియామకంపై విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.పట్టణ పొదుపు మహిళల పేరుతో గత కొన్నేళ్లుగా జరిగిన అవినీతి బాగోతం బయటకు రావడం, బాధితులు న్యాయం చేయాలని రోడ్డెక్కడంపై కలెక్టర్ పి.రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సీరియస్‌గా దృష్టి సారించారు. ఈక్రమంలో జేసీ గోపాలకృష్ణ చైర్మన్‌గా, జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణతో కూడా త్రిసభ్య కమిటీని కలెక్టర్ విచారణకు నియమించారు. వారం క్రితం మెప్మా కార్యాలయానికి జేసీ తనిఖీ చేశారు. అధికారుల నుంచి కొన్ని వివరాలను సేకరించారు. అయితే పూర్తిస్థాయి సమాచారం మెప్మా నుంచి లభించడం లేదని గుర్తించిన ఆయన లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. పొదుపు సభ్యులకు రుణాలు మంజూరు చేసిన అన్ని బ్యాంకుల నుంచి సమాచారం సేకరించినట్లు సమాచారం. ఈ మేరకు ప్రకాశం భవన్‌లో జేసీ ఆధ్వర్యంలో విచారణ జరగనుంది.

# భారత్‌లో అమెజాన్ మెగా ప్లాన్.. 35 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడికి రెడీ!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో భారీ పెట్టుబడులకు ప్రణాళికలు ప్రకటించింది. 2030 నాటికి తమ వ్యాపార కార్యకలాపాల విస్తరణ కోసం సుమారు 35 బిలియన్ డాలర్లు (రూ. 3.14 లక్షల కోట్లకు పైగా) పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు కంపెనీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అమెజాన్ 'సంభవ్ సమ్మిట్' సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ ఈ ప్రకటన చేశారు. "అమెజాన్ ఇప్పటివరకు భారత్‌లో 40 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టింది. ఇప్పుడు 2030 నాటికి మా అన్ని వ్యాపారాల్లో మరో 35 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టబోతున్నాం" అని ఆయన వివరించారు. ఈ పెట్టుబడులతో భారత్ నుంచి ఎగుమతులను ప్రస్తుతమున్న 20 బిలియన్ డాలర్ల నుంచి 80 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే, అదనంగా 10 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించనున్నట్లు స్పష్టం చేశారు.

ఈ పెట్టుబడి ప్రణాళిక, మైక్రోసాఫ్ట్ (17.5 బిలియన్ డాలర్లు), గూగుల్ (15 బిలియన్ డాలర్లు) ప్రకటించిన పెట్టుబడుల కన్నా చాలా అధికం. కీస్టోన్ నివేదిక ప్రకారం అమెజాన్ భారత్‌లో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా నిలిచింది. ఈ పెట్టుబడుల ద్వారా ఫిజికల్, డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయనున్నట్లు అగర్వాల్ చెప్పారు. ఇందులో భాగంగా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, రవాణా నెట్‌వర్క్‌లు, డేటా సెంటర్లు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలను విస్తరించనున్నారు. ఎగుమతులను ప్రోత్సహించేందుకు 'ఎక్స్‌పోర్ట్స్' పేరుతో ఒక కొత్త కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. దీని కింద దేశంలోని సూరత్, తిరుపూర్, కాన్పూర్ వంటి 10 తయారీ క్లస్టర్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారుభూకంపం సంభవించింది, సునామీ రావడంతో ఘోర ప్రాణనష్టానికి దారితీసింది.




## హాకీ వరల్డ్‌కప్‌లో భారత్‌కు 'బ్రాంజ్' మెడల్- అర్జెంటీనాపై విజయం



2025 పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు బ్రాంజ్ మెడల్ దక్కింది. రీసెంట్‌గా ఈ టోర్నీలో సెమీఫైనల్‌లో ఓడిన భారత్, తాజాగా మూడో స్థానం కోసం అర్జెంటినాతో తలపడింది. ఈ మ్యాచ్‌లో అర్జెంటినాపై ఆధిపత్యం సాధించిన భారత్ 4-2 తేడాతో నెగ్గి, బ్రాంజ్ మెడల్ దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో అదరగొట్టిన అన్‌మోల్ ఎక్కాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

భారత జట్టులో అంకిత్ పాల్, మన్మీత్ సింగ్, శ్రద నంద్ తివారీ, అన్?మోల్ ఎక్కా తలో ఒక గోల్ సాధించారు. అర్జెంటీనా తరఫున నికోలస్ రోడ్రిగ్జ్, శాంటియాగో ఫెర్నాండెజ్ గోల్స్ చేశారు. దీంతో భారత్ 4-2 తేడాతో నెగ్గి టోర్నీని మూడో స్థానంతో ముగించింది. అయితే ఈ టోర్నీ చరిత్రలో భారత్ మూడో స్థానంలో నిలవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈ టోర్నీలో మురీడో స్థానంలో నిలిచిన భారత్‌కు హాకీ ఇండియా క్యాష్ రివార్డ్ ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో అధికారికంగా అనౌన్స్ చేసింది. దీంతో ఒక్కో ప్లేయర్‌కు రూ.5 లక్షల నజరానా అందనుంది. అలాగే సపోర్టింగ్ స్టాఫ్‌లోని ఒక్కొక్కరికి రూ.2.5 లక్షలు ఇవ్వనున్నారు.

## రెండో టీ-20లో దక్షిణాఫ్రికాపై

# టీమిండియా విజయం సాధించేనా?



టీ20 సిరీసను అదిరే విజయంతో ఆరంభించిన భారత్.. అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐదు మ్యాచ్‌ల సిరీసలో భాగంగా గురువారం దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టీ20లోనూ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. కటక్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టినా.. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వైఫల్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గాయంతో వన్డే సిరీసకు దూరమైన అతడు తగిన విశ్రాంతి తర్వాత బరిలోకి దిగినా.. స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ముఖ్యంగా అభిషేక్ శర్మకు అతడు ఏమాత్రం సరితూగడం లేదు. గిల్ రాకతో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు కష్టమవుతుండడం కూడా అతడిపై ఒత్తిడికి కారణమవుతోంది. తొలి మ్యాచ్‌లో విఫలమైన జితేష్ శర్మకు బదులుగా సంజూ శాంసన్‌ను తీసుకోవాలని సోషల్‌మీడియాలో చర్చ మొదలైంది. కీపర్ బెర్త్ కోసం వీరిద్దరి మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. ఇక, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై కూడా ఆందోళన నెలకొంది. పొట్టి వరల్డ్‌కప్ నేపథ్యంలో సూర్య తన మునుపటి విధ్వంసకర బ్యాటింగ్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. అయితే, గాయం నుంచి కోలుకొన్న హార్దిక్ పాండ్యా ఆడిన తొలి మ్యాచ్‌లోనే అజేయ అర్ధ శతకంతో అదరగొట్టాడు. అతడి నుంచి జట్టు ఇదే తరహా ఇన్నింగ్స్‌ను జట్టు ఆశిస్తోంది. అయితే, బ్యాటింగ్ డెప్త్ కావాలనుకొంటే అర్ష్‌దీప్ స్థానంలో హర్షిత్ రాణాను తీసుకొనే చాన్సులున్నాయి. ఒకవేళ పిచ్ పొడిగా ఉంటే మాత్రం జట్టులో ఎటువంటి మార్పులూ ఉండే అవకాశం లేదు. మరోవైపు దక్షిణాఫ్రికా బలంగా పుంజుకోవాలనుకొంటోంది. బ్రెవిస్ మినహా మిగతా బ్యాటర్లు విఫలం కావడం జట్టును కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో బలమైన బ్యాటింగ్ లైనప్ కోసం సిపామ్లా స్థానంలో ఆల్‌రౌండర్ కోర్బిన్ బాష్‌కు చాన్స్ దక్కొచ్చు.




## 25న థియేటర్స్‌కు రానున్న

# 'ఛాంపియన్'



తెలుగు తెర ఎప్పటికప్పుడు కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తూ ఉంటుంది. కొత్త బ్యూటీలను ఆదరించడానికి ఇక్కడి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. ఒకప్పుడు ఇక్కడి సిల్వర్ స్క్రీన్ పై ముంబై భామల హవా కొనసాగినప్పటికీ, ఆ తరువాత కాలంలో మలయాళ భామలు తమ జోరును కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పటికీ ఇక్కడ వారి దూకుడే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మరో అమ్మాయి మలయాళం నుంచి దిగిపోయింది. ఆ బ్యూటీ పేరే అనశ్వర రాజన్. అనశ్వర రాజన్ .. మలయాళంలో .. అక్కడి యూత్ లో ఇప్పుడు విపరీతమైన క్రేజ్ ఉన్న హీరోయిన్. అనశ్వరలో ఏదో తెలియని ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుంది. అందుకు సహజమైన ఆమె అభినయం కూడా తోడవడం .. సక్సెస్ లు వచ్చిపడటంతో బిజీగా మారిపోయింది. మలయాళంలో వచ్చిన 'నెరు' .. 'రేఖాచిత్రం' వంటి చిత్రాలు ఆమె నటనకి అద్దం పడతాయి. మోహన్ లాల్ వంటి గొప్ప నటుడితో ప్రశంసలు అందుకోవడం అనశ్వర ప్రతిభకు నిదర్శనం అనే చెప్పాలి. మలయాళంలో ఇప్పుడు అనశ్వరకి విపరీతమైన క్రేజ్ ఉంది. అక్కడి సినిమాలను లైన్లో పెడుతూనే, ఆమె తెలుగు .. తమిళ .. హిందీ సినిమాలు చేయడానికి ఆసక్తిని కనబరుస్తూ ఉండటం విశేషం. తెలుగులో ఆమె చేసిన 'ఛాంపియన్' సినిమా ఈ నెల 25వ తేదీన థియేటర్లకు రానుంది. శ్రీకాంత్ తనయుడు రోషన్ జోడీగా ఆమె పరిచయమవుతూ ఉండటం విశేషం. ఈ సినిమా హిట్ అయితే అనశ్వర ఇక్కడ మరిన్ని సినిమాలు చేసే ఛాన్స్ ఉంది. ఓటీటీ సినిమాల ద్వారా అనశ్వర అభిమానులుగా మారిపోయిన ఇక్కడి కుర్రాళ్లంతా ఈ సినిమా కోసమే వెయిట్ చేస్తున్నారు.

## అఖండ-2 రిలీజ్‌తో వాయిదా పడిన

# చిన్న సినిమాలు

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న భారీ చిత్రం 'అఖండ 2' విడుదల ప్రభావం టాలీవుడ్‌లోని చిన్న చిత్రాలపై గట్టిగా పడింది. డిసెంబరు 12న ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో, అదే తేదీకి విడుదల కావాల్సిన పలు చిన్న సినిమాలు తమ విడుదల తేదీలను వాయిదా వేసుకున్నాయి. ఈ పరిణామంపై నిర్మాతలు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, బన్నీ వాసు స్పందించారు.



'ఈషా' సినిమా ప్రెస్‌మీట్‌లో దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'అఖండ 2' రాకతో చిన్న చిత్రాలపై ప్రభావం పడిన మాట వాస్తవమేనని అన్నారు. పెద్ద, చిన్న సినిమా ఏదైనా వ్యాపారమేనని, కానీ పెద్ద సినిమా వస్తున్నప్పుడు ప్రేక్షకుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. చిత్ర పరిశ్రమ ఒక అసంఘటిత రంగమని, ఫిల్మ్ ఛాంబర్‌లో ఎన్నిసార్లు చర్చించినా పరిస్థితి మారదన్నారు. అందుకే చిన్న నిర్మాతలు ఎప్పుడూ తమ సేఫ్టీ చూసుకుంటారని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి హోదాలో ఆయన వ్యాఖ్యానించారు.

మరో నిర్మాత బన్నీ వాసు స్పందిస్తూ.. మనం కారులో వెళ్తుంటే వెనుక నుంచి లారీ హారన్ కొడితే పక్కకు తప్పుకుంటామని, సినిమాల విషయంలోనూ అంతే నంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అఖండ 2' కారణంగా డిసెంబరు 12న విడుదల కావాల్సిన 'ఈషా' చిత్రాన్ని డిసెంబరు 25కు వాయిదా వేశారు. అలాగే 'మోగ్లీ' సినిమాను 13కు, 'సుకుటుంబానాం' 19కి, 'సైక్ సిద్ధార్థ్'ను 2026 జనవరి 1కి మార్చారు. వీటితో పాటు 'ఘంటసాల', 'నా తెలుగోడు', 'మిస్టీరియస్' వంటి మరికొన్ని చిత్రాల కొత్త విడుదల తేదీలను ప్రకటించాల్సి ఉంది.






## టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న

# రియా సింఘా




అందాల పోటీల్లో సత్తా చాటిన మరో భామ వెండితెరపై అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. మిస్ యూనివర్స్ ఇండియా-2024 విజేత రియా సింఘా నటిగా తన ప్రయాణాన్ని తెలుగు సినిమాతోనే ప్రారంభించడం విశేషం. కమెడియన్ సత్య హీరోగా, 'మత్తు వదలరా' ఫేమ్ రితేశ్ రాణా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జెట్లీ' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. బుధవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రియా సింఘా ఇంటెన్స్ లుక్‌తో, యాక్షన్‌కు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో ఆమె 'శివానీ రాయ్' అనే పాత్రను పోషిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఆమె పాత్రకు సినిమాలో యాక్షన్‌కు మంచి ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. గుజరాత్‌కు చెందిన రియా సింఘా, 18 ఏళ్ల వయసులోనే మిస్ యూనివర్స్ ఇండియా-2024 కిరీటాన్ని గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. అంతకుముందు ఏడాది 'మిస్ టీన్ గుజరాత్', 'మిస్ టీన్ ఎర్త్' టైటిల్స్‌ను కూడా సొంతం చేసుకున్నారు. మిస్ టీన్ గుజరాత్ గెలిచిన తొలి గుజరాతీ అమ్మాయిగా ఆమె గుర్తింపు పొందారు. ఇటీవల జరిగిన 'మిస్ యూనివర్స్-2024' పోటీల్లో టాప్ 30లో నిలిచారు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే రియా, పాఠశాల రోజుల నుంచే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. ఆమె ఒక టెడెక్స్ స్పీకర్ కూడా. పెర్ఫామింగ్ ఆర్ట్స్‌లో ఆమె డిగ్రీ పూర్తి చేశారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**